**ఆకాశవాణి  హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 09.06.2024** **సమయం: 1.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. బీజేపీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ ఈ రోజు వరుసగా మూడవ సారి దేశ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి భవన్ లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ కొత్త మంత్రిమండలి చేతకూడా పదవీ ప్రమాణం చేయిస్తారు.

2. నిన్న తెల్లవారుజామున హైదరాబాద్ లో కన్నుమూసిన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వ అధికార లాంఛనాలతో కొద్దిసేపటి క్రితం ముగిశాయి.

3. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై న్యాయ విచారణలో భాగంగా రేపటి నుండి వరుసగా ఆరు రోజుల పాటు అధికారులతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిటీ సమావేశం అవుతుంది.

4. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు జరిగిన గ్రూప్ -1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

------------

## NEW PM- SWEARING-IN CEREMONY

బీజేపీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ ఈ రోజు వరుసగా మూడవ సారి దేశ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి భవన్ లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త మంత్రిమండలి చేతకూడా పదవీ ప్రమాణం చేయిస్తారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయవలసిందని కోరుతూ మోదీని రాష్ట్రపతి ఆహ్వానించారు. ఈ సాయంత్రం 7గంటల 15 నిమిషాలకు ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుంది. మొన్న శుక్రవారం రాష్ట్రపతిని మోదీ కలిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత తెలిపారు. బీజేపీ అధ్యక్షుడు జె.పీ నడ్డా నేతృత్వంలోని ఎన్.డీ.ఏ ప్రతినిధి వర్గం కూడా రాష్ట్రపతిని కలుసుకుని నరేంద్ర మోదీ బీజేపీ పార్లమెంటరీ పార్టీ నాయకునిగా ఎన్నికైనట్టు లేఖ అందజేసింది. ఎన్.డీ.ఏ భాగస్వామ్య పక్షాల మద్దతు లేఖలను కూడా రాష్ట్రపతికి అందజేశారు. పలువురు అంతర్జాతీయ ప్రముఖులు కూడా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటున్నారు. శ్రీలంక అధ్యక్షుడు రణీల్ విక్రమ సింఘే, మాల్దీవ్స్ ల అధ్యక్షుడు డా. మహ్మద్ ముయిజ్జు, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ ఆసిఫ్, బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా, మారీషస్ ప్రధానమంత్రి ప్రవింద్ కుమార్ జుగనాథ్, నేపాల్ ప్రధానమంత్రి పుష్పకమల్ దహాల్ ప్రచండ, భూటాన్ ప్రధానమంత్రి షేరింగ్ తోబ్గే తదితరులు ప్రమాణస్వీకారానికి హాజరౌతారు. **(NSD)**

---------------

## MINISTERS FROM TELANGANA

కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరికి అవకాశం లభించినట్టు విశ్వసనీయ సమాచారం అందింది. సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డితో పాటు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కు నూతన మంత్రివర్గంలో చోటు లభించనుంది. వీరిద్దరికీ ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ కాల్స్ వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఇద్దరు నేతలు ప్రధానమంత్రి నివాసంలో కొద్దిసేపటి క్రితం జరిగిన తేనీటి విందుకు హాజరయ్యారు.

వీరిలో ఇప్పటికే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రివర్గంలో పని చేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా కూడా కిషన్ రెడ్డి కొనసాగుతున్నారు. నూతనంగా మంత్రివర్గంలో బండి సంజయ్

కు అవకాశం కల్పించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. కరీంనగర్ ఎంపీగా ఎన్నికైన బండి సంజయ్ గతంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఆయన 2 లక్షల 25 వేల ఓట్లకు పైగా మెజారిటీ సాధించారు. –SDP

---------------

**RAMOJI RAO - LAST RITES**

నిన్న తెల్లవారుజామున హైదరాబాద్ లో కన్నుమూసిన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వ అధికార లాంఛనాలతో కొద్దిసేపటి క్రితం ముగిశాయి. రామోజీరావు భౌతిక కాయాన్ని ఈ ఉదయం ఊరేగింపుగా ఫిల్మ్ సిటీలోని అంత్యక్రియల స్థలానికి తీసుకువచ్చారు. ఆయన కుమారుడు కిరణ్ రామోజీ పార్థివ దేహానికి నిప్పంటించారు. పార్థివదేహానికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, బీజేపీ ఎం.పీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లతో పాటు పలువురు రాజకీయ, సినీ, పత్రికా రంగాల ప్రముఖులు అంత్యక్రియలకు హాజరయ్యారు. రామోజీరావు మృతికి సంతాప సూచకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు, రేపు సంతాప దినాలు పాటించాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ లో అన్ని ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాన్ని అవనతం చేస్తారు. అన్ని రకాల అధికారిక ఉత్సవాలను రద్దు చేశారు. **(NSD)**

---------------

**PCGHOSH COMMITTEE**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై న్యాయ విచారణ ప్రక్రియలో భాగంగా రేపటి నుండి వరుసగా ఆరు రోజుల పాటు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిటీ అధికారులతో సమావేశం అవుతుంది. నిన్న సుందిళ్ల బ్యారేజీని సందర్శించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ అక్కడ మరమ్మతు పనులను పరిశీలించారు. వాటిపై రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాకులో సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసర్చ్ స్టేషన్ పరీక్షలు కొనసాగిస్తోంది. కుంగిన ప్రతి పిల్లరుతో పాటు గేట్ల ముందున్న బే ప్రాంతాల్లో కూడా నిపుణులు డ్రిల్లింగ్ నిర్వహిస్తున్నారు. –DESK

---------------

**ఆరోగ్యశ్రీ**

ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్స విధానాలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 1375 పాత చికిత్స విధానాలకు నగదు ప్యాకేజీ పెంపు చేయాలని నిర్ణయం తీసుకుంది. వీటికి గాను 487 కోట్ల రూపాయలను ఆర్థిక శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విడుదల చేశారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుముక వంటి ఖరీదైన వ్యాధులకు చికిత్స, ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ పథకంలోని చికిత్సల ప్యాకేజీ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీటికి సంబంధించి 497.29 కోట్లు రూపాయలు అవసరం కాగా నిన్న ఈ నిధులను విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. –SDP

---------------

**GROUP-I**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు గ్రూప్ -1 పరీక్షను తెలంగాణపబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించింది. ఈ ఉదయం 10.30 నుండి ఒంటి గంట వరకు జరిగిన ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఈ కేంద్రాల్లో సుమారు 4 లక్షల మంది అభ్యర్తులు పరీక్ష రాశారు. ఉదయం తొమ్మిదిన్నర నుండే అభ్యర్థుల బయో మెట్రిక్ హాజరు నమోదు చేశారు.అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పర్యవేక్షించేందుకు ప్రతి 20 కేంద్రాలకు ఒక ప్రాంతీయ సమన్వయకర్తను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్ల పరిశీలన కోసం ప్రతి వంద మంది అభ్యర్థులకు ఒక అధికారిని ఏర్పాటు చేశారు. –DESK

---------------

**గ్రూప్ 1- PTCs**

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలు వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. హంటర్ రోడ్ పరీక్ష కేంద్రాలనుజిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు.

కొత్తగూడెం జిల్లా పేపలగడ్డలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పరిశీలించారు. అక్కడ విధులలో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. -PTCs

---------------

**GROUP I-ASIFABAD**

ఆసిఫాబాద్ జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఏఎస్పి ప్రభాకర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. -PTC, Asifabad

---------------

**GROUP I-KARIMNAGAR**

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల జవాబు పత్రాలను పరీక్ష పూర్తయిన కేంద్రాల నుండి తిరిగి స్ట్రాంగ్ రూమ్ కు తీసుకువచ్చేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్టు కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ చెప్పారు. జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలు రాసిన 18,663 మంది అభ్యర్థులకు సంబంధించిన ప్రశ్న పత్రాలను పోలీస్ కమీషనరేట్ లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్టు ఆయన చెప్పారు. -PTC, karimnagar

---------------

**GROUP I-MAHABUBABAD**

గ్రూప్...1 ప్రిలిమినరీ పరీక్ష పటిష్ట ఏర్పాట్ల నడుమ మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాలలో 4 వేలకు పైగా అభ్యర్థులు గ్రూప్...1 పరీక్షకు హాజరయ్యారు. **-PTC, Mahabubabad**

---------------

**GROUP I-SANGAREDDY**

సంగారెడ్డి జిల్లాలో టీజీపీఎస్ సి గ్రూప్-1 పరీక్ష నిర్వహణను అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ పరిశీలించారు. సంగారెడ్డిలోని 16 పరీక్ష కేంద్రాలలో 9 వేలకు పైగా అభ్యర్థులు గ్రూప్ వన్ పరీక్షకు హాజరయ్యారు. -PTC, Sangareddy

---------------

**GROUP I- JAGITYALA**

జగిత్యాల జిల్లాలో గ్రూప్- 1 పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పరిశీలించారు. పలు పరీక్ష కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. జిల్లా లో ఈ పరీక్షలకు 7 వేలకు పైగా అభ్యర్థులు హాజరయ్యారు. --పీటీసీ, జగిత్యాల

---------------

**SOUTHWEST MONSOON**

దేశంలో నైరుతి రుతుపవనాల రాక ప్రారంభమైంది. ఈ క్రమంలో అనేక చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. వచ్చే రెండు రోజుల పాటు దక్షిణ మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాతోపాటు కోస్తా ఆంధ్రాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇదిలాఉండగా రాష్ట్ర రాజధాని హైదరాబాదుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈరోజు ఆకాశం మేఘావృతమై ఉంటుందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు తేలికపాటి నుండి సాధారణ వర్షపాతం గానీ ఉరుములతో కూడిన జల్లులు కానీ కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. –DESK

---------------

**COCA-COLA**

ప్రముఖ అంతర్జాతీయ శీతల పానీయాల కంపెనీ కోకా కోలా రాష్ట్రంలో కొత్త పెట్టుబడులకు సిద్ధమైంది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఈ విషయాన్ని సామాజిక మాధ్యమంలో వెల్లడించారు. విస్తరణలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఆ కంపెనీ తెలిపిందని మంత్రి వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలో కోకా కోలా కంపెనీ ప్లాంట్ ఉండగా విస్తరణలో భాగంగా పెద్దపల్లిలో రూ.700 కోట్ల పెట్టుబడులు పెట్టాలని ఆ సంస్థ నిర్ణయించింది. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోకా కోలా గ్రూప్ డైరెక్టర్ జొనాథన్ రీఫ్‌తో అట్లాంటాలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పరిశ్రమలు పెట్టాలని కంపెనీని మంత్రులు ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన జొనాథన్.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. -DESK

---------------

RTO

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహనదారులు తమ వాహన పన్ను రవాణా శాఖకు చెల్లించాలని, జిల్లా రవాణా శాఖ అధికారి వీ లక్ష్మణ్ తెలిపారు. పన్ను చెల్లించని వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే సంబంధిత వాహనం పన్నుపై అపరాధ రుసుం మొదటి నెల 50 శాతం, రెండో నెల 100 శాతం, మూడో నెలలో 200 శాతం అదనంగా వసూలు చేస్తామని స్పష్టం చేశారు. -PTC, Rajannasiricilla

---------------